క్లుప్తంగా

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలోని గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్, హెచ్‌ఎం చాట్ల శ్రీనివాసరావు, టీచర్లు పీ రమేష్, సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి కొలుపులు



పూజల్లో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు



అంకమ్మ తల్లి కొలుపులకు హాజరైన భక్తులు

- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామంలో అంకమ్మ తల్లి కొలుపులను గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అంకమ్మ తల్లి కొలుపుల్లో ఈసారి ఎన్నికల కోడ్ ఉండటంతో విద్యుత్ ప్రభల ఏర్పాటుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. పూజారులు ఆదివారం తెల్లవారుజామునే అమ్మవారి కొలుపులు ప్రారంభించి మధ్యాహ్నం మూడు గంటల వరకూ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు బొట్లు పెట్టి వారికి అమ్మవారి దగ్గరి వడ్లు పంచారు. రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై మహేష్ బందోబస్తు నిర్వహించారు. సాయంత్రం కొందరు భక్తులు పాప వేషాలు వేసుకుని గుడి చుట్టూ తిరిగి మొక్కులు తీర్చుకున్నారు.

పూజలు చేసిన మంత్రి మేరుగు నాగార్జున...

ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో దొడ్డవరం అంకమ్మ తల్లిని మంత్రి మేరుగు నాగార్జున దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అభివాదం చేస్తూ మేలు జరగాలని అమ్మవారిని కోరుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బస్ షల్టర్, చలివేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి మేరుగు...

దొడ్డవరం గ్రామం సెంటర్లో ఏర్పాటు చేసిన బస్ షల్టర్, చలివేంద్రాలను మంత్రి మేరుగు నాగార్జున ఆదివారం ప్రారంభించారు. మాజీ సర్పంచ్ బత్తుల కోటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ఆది, సోమవారాల్లో అంకమ్మ తల్లి కొలుపులకు వచ్చే భక్తులకు 40 వేల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



ఈస్టర్ సందర్భంగా ఆదివారం ఒంగోలు మేయర్ గంగాడ సుజాత నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు హాజరయ్యారు.

ప్రతిఒక్కరి మొహంలో సంతోషం



19వ డివిజన్ భాగ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవికి హారతిస్తున్న మహిళ

- వైఎస్సార్ సీపీ హయాంలో వివక్షకు తావులేకుండా సంక్షేమం
- అభివృద్ధిలోనూ అగ్రస్థానం
- 19, 15 డివిజన్లలో బాలినేని శచీదేవి, శ్రీకావ్య ఇంటింటి ప్రచారం



15వ డివిజన్ అన్నవరప్పాడులో ప్రచారం చేస్తున్న బాలినేని శ్రీకావ్య

ఒంగోలు: మహిళలతో మమేకం–స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక 19, 15 డివిజన్లలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి, కోడలు శ్రీకావ్య వేర్వేరుగా ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఎంతో సంతోషంతో ఆత్మీయంగా వారిని ఆహ్వానించారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వారు వివరించారు. పలువురు వృద్ధులు ఒకటో తేదీ వలంటీర్లు పెన్షన్ ఇవ్వరట, మమ్మల్ని ఎక్కడికో రమ్మంటారట అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలినేని శచీదేవి మీడియాతో మాట్లాడుతూ టీడీపీ కుట్రలతో వలంటీర్లు పెన్షన్ ఇవ్వకుండా చేశారన్నారు. ఇంటింటి ప్రచారంలో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తమకు పెన్షన్లు వలంటీర్లు ఇవ్వరా అని అడుగుతుంటే బాధ కలుగుతోందన్నారు. నిస్వార్థంగా సేవ చేసే వలంటీర్లకు రాజకీయం అంటగట్టి లబ్ధిదారులపై కక్ష తీర్చుకోవడం ఎంతవరకు సబబు అని టీడీపీని ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల కమిషన్ పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. 19వ డివిజన్‌లో ఇప్పటివరకు రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వాసన్నను, జగనన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు (చిన్నారి), డివిజన్ అధ్యక్షుడు రాజేష్, ఇన్‌చార్జి నరాల రమణారెడ్డి, రవిచంద్ర కుమార్, నరేష్, గణేష్, పవన్, అనీల్, కోటి, చలపతి, జిలానిబాషా, మీరా మొహమ్మదీన్, సుజాత, పద్మ, శశికళ, బాల, సరస్ తదితరులు పాల్గొన్నారు. 15వ డివిజన్‌లో శ్రీకావ్య ఇంటింటి ప్రచారం నిర్వహించగా పథకాల లబ్ధిదారులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమకు ఎన్ని రకాలుగా మేలు జరిగిందో చెప్పుకుంటూ జగనన్నకు, వాసన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. శ్రీకావ్య మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఇంట్లో జగనన్న స్టార్ క్యాంపెయినర్లకు లెక్కే లేదన్నారు. డివిజన్‌లో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. స్థానిక కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్, డివిజన్ అధ్యక్షుడు ఆనం శ్రీనివాసరెడ్డి, నాయకులు చైతన్య, ఆత్మకూరు శేషమ్మ, గార్లగుంట రమ, ముత్యాల నాగలక్ష్మి, ఒరుపల్లి మహాలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, గుడె పద్మశ్రీ, యల్లమూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లంటే భయంతోనే పెన్షన్ల పంపిణీని అడ్డుకున్నారు

- వలంటీర్లు అందించే సేవలను ప్రభుత్వ ఉద్యోగులతో అందించడం అసాధ్యం
- మండే ఎండలో సచివాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు పడేలా చేయడం సరికాదు
- ఎన్నికల కోడ్ పేరుతో వలంటీర్ల సేవలను అవమానించారు
- ఇందుకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజానీకం సిద్ధం కావాలి
- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి



మాట్లాడుతున్న తమ్మినేని మాధవి, కార్పొరేటర్లు

ఒంగోలు: వలంటీర్లను తలచుకుంటేనే టీడీపీకి భయం పట్టి పీడిస్తోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అనే సంస్థకు వెనుక ఉంది చంద్రబాబే అన్నారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన నిమ్మగడ్డ రమేష్ హైకోర్టును ఆశ్రయించి ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెన్షన్లను వలంటీర్ల ద్వారా పంపిణీ చేయించరాదని కోరడం, హైకోర్టు ఉత్తర్వులతో ఎన్నికల కమిషన్ ప్రత్యామ్నాయ చర్యలు చూసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేస్తూ ఉత్తర్వులు జారీచేయడం బాధ కలిగిస్తోందన్నారు. 2.40 లక్షల మంది వలంటీర్లు అందించే సేవలను ప్రభుత్వ ఉద్యోగులు తమ పని తాము చేసుకుంటూ ఎలా అందించగలరన్నారు. మంచం మీద నుంచి కదలలేని స్థితిలో ఉన్నవారిని నేడు మంచంతో సహా సచివాలయం వద్దకు తీసుకురావాలా అని ప్రశ్నించారు. వలంటీర్లను ప్రజలు తమ బిడ్డల్లా భావిస్తుండటాన్ని చూసి తట్టుకోలేక టీడీపీ చేస్తున్న కుట్రలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సమాయత్తం కావాలన్నారు. నగర అధ్యక్షురాలు చింతగుంట్ల సువర్ణ మాట్లాడుతూ కొంతమంది వేలిముద్రలు పడనివారు, ఐరిష్ తీసుకోవాల్సిన వారికి వలంటీర్ లాగిన్ ద్వారా చేయాల్సి ఉంటుందని, వలంటీర్ లేకుండా అటువంటి వారికి పెన్షన్ ఎలా ఇస్తారనేది ప్రకటించాలని అన్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో పెన్షన్ పొందడం ఒక శాపంగా ప్రజలు భావించేవారని, కానీ.. నేడు ఆత్మగౌరవంగా వారు పెన్షన్ అందుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం మళ్లీ ఆ దుర్దినాన్ని తలపించేలా వారందరినీ మండుటెండల్లో సచివాలయాల వద్దకు రప్పించేలా టీడీపీ వ్యవహరిస్తున్న తీరు వారి సైకోతనానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, 39వ డివిజన్ కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకురాలు తాటిపర్తి అంజలి పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అడ్డుకోవడం దుర్మార్గం

- ఎన్నికల్లో టీడీపీ కూటమికి గుణపాఠం చెప్పాలి
- వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య



కొండ్రాజు రమణయ్య

ఒంగోలు సెంట్రల్: రాష్ట్రంలో ఇంటికెళ్లి పెన్షన్లు పంచకుండా వలంటీర్ల సేవలు అందకుండా టీడీపీ కూటమి అడ్డుకోవడం దారుణమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండ్రాజు రమణయ్య అన్నారు. నిమ్మగడ్డ రమేష్ ద్వారా పిటిషన్ వేయించి అడ్డుకోవడం వలన వృద్ధులు, దివ్యాంగులు రాబోయే రెండు నెలల పాటు పెన్షన్ల కోసం సచివాలయాలకు వెళ్లి ఎండలో పాట్లు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి పూర్తి బాధ్యత టీడీపీ కూటమి వహించాల్సి ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పెన్షన్ల లబ్ధిదారులు వైఎస్సార్ సీపీకి ఓటేసి టీడీపీ కూటమికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.



ఆర్యవైశ్య ప్రముఖుడు, ఆడిటర్ జగన్‌మోహన్‌రావు ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న సూర్యప్రకాష్, రామిరెడ్డి, తదితరులు

ఒంగోలు సెంట్రల్: దేశ సేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఒంగోలు కేంద్రీయ విద్యాలయ ప్రధానాచార్యులు సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సూర్యప్రకాష్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో కూడా ప్రతిభ చాటాలని సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రధానాచార్యులు రామిరెడ్డి వార్షిక నివేదిక సమర్పించారు. గత సంవత్సరం పదో తరగతిలో, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో, పూణేలో జరిగిన జాతీయ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో విద్యార్థులు ప్రతిభ చాటి ఖ్యాతిని ఇనుమడింపజేశారని కొనియాడారు. మిలీనియం బ్యాచ్ విద్యార్థులు (2000–2007) విద్యా సంవత్సరాలకు చెందిన వారు విద్యాలయానికి రూ.2.50 లక్షల విలువైన ఇన్వర్టర్లు, ఫాగింగ్ మిషన్, 20 సిమెంట్ బెంచ్‌లు బహూకరించారు. విద్య, క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యాలయ ఉప ప్రధానాచార్యులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, లెక్చరర్ రాజశేఖర్‌రెడ్డి, పీటీసీ మెంబర్లు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సీనియర్స్ అనుభవాలతో అభ్యున్నతి

ఒంగోలు సెంట్రల్: కళాశాలలో సీనియర్ విద్యార్థుల అనుభవాలు జూనియర్స్ అభ్యున్నతికి చక్కగా ఉపయోగపడతాయని స్థానిక రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు అన్నారు. కళాశాలలో ఈసీఈ విభాగానికి చెందిన మూడో సంవత్సరం విద్యార్థులు ఆదివారం నాలుగో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. కళాశాల చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఫొటో గ్యాలరీని సందర్శించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీనియర్ విద్యార్థులు వారి అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. లెక్చరర్ల మాటలు విని జీవితంలో ఎదగాలని కోరారు. డైరెక్టర్ ఏవీ భాస్కర్‌రావు మాట్లాడుతూ నాలుగో సంవత్సరం విద్యార్థులు రిజిస్టర్ అయిన వారిలో 75 శాతం ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్ చినరంగమన్నారు, అధ్యాపక బృందం

దొడ్డవరంలో పారామిలిటరీ కవాతు



పారా మిలిటరీ దళాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఎస్సై మహేష్

మద్దిపాడు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని దొడ్డవరం ప్రధాన వీధుల్లో ఎస్సై వి.మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం పారా మిలిటరీ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే రీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదన్నారు. అదే విధంగా ఎన్నికల్లో ఎటువంటి గొడవలు పడరాదని నాయకులు, కార్యకర్తలను హెచ్చరించారు. ప్రజలను మభ్యపెట్టడానికి బహుమతులు పంచకూడదని, అటువంటి పనులు చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తాము పనిచేస్తామని తెలిపారు. ప్రజలు ఈ విషయాలు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కవాతులో 40 మంది పారా మిలటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈతముక్కల పాలిటెక్నిక్ కళాశాలలో

ఉచిత శిక్షణ తరగతులు

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల పాలిటెక్నిక్ కళాశాలలో నేటి నుంచి పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ కోర్సులో చేరదలిచిన వారికి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈతముక్కల ఎస్‌వీయూఆర్ అండ్ ఎస్ఆర్ మహిళా గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ వి.యేసుప్రసాద్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ వంటి వివిధ డిప్లమా ఇంజినీరింగ్ కోర్సులు చేరే విద్యార్థుల కోసం పాలిసెట్–2024 పరీక్షలను ఏప్రిల్ 27వ తేదీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ పోటీ పరీక్షల నిమిత్తం శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. ఈతముక్కల మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణకు హాజరైన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇంగ్లిష్, తెలుగు మాధ్యమంలో ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని బాలబాలికలు వినియోగించుకోవాలని కోరారు. పాలిసెట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5 చివరి తేదీ అని తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ వచ్చి ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 9912342071, 8919693460 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.